నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, శనివారం 18 జనవరి 2025 | HYDERABAD


## ర్యాపిడో డ్రైవర్‌కు బురిడీ

బంజారాహిల్స్,జనవరి 17: ర్యాపిడో డ్రైవర్‌ను బురిడీ కొట్టించి అతడి ద్విచక్రవాహనంతో ఉడాయించిన వ్యక్తిపై ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. సరూర్‌నగర్‌లోని వెంకటేశ్వరకాలనీలో నివాసముంటున్న మంత్రి హరిప్రసాద్(26) అనే యువకుడు ర్యాపిడో బైక్ నడిపిస్తుంటాడు. గురువారం రాత్రి సికింద్రాబాద్ స్టేషన్ వద్ద వేచి ఉన్న హరిప్రసాద్ వద్దకు గుర్తుతెలియని వ్యక్తి లగేజీతో వచ్చాడు. ర్యాపిడో బైక్ డ్రైవర్‌వా .. అంటూ ఆరా తీశాడు. తాను టోలీచౌకీ వెళ్లాల్సి ఉందని చెప్పాడు. దీంతో అతడిని డ్రాప్ చేసేందుకు హరిప్రసాద్ ఒప్పుకున్నాడు. అక్కడి నుంచి బయలుదేరిన హరిప్రసాద్ ఎమ్మెల్యే కాలనీ దాటగానే అడ్రెస్ చెప్పడం కష్టమని, తాను డ్రైవింగ్ చేస్తానని, వెనక కూర్చోవాలని గుర్తు తెలియని వ్యక్తి చెప్పి యాక్టివా బైక్ తీసుకున్నాడు. కొన్ని గల్లీలు తిప్పిన తర్వాత టోలీచౌకిలోని కడక్ హౌస్ వద్ద బైక్ ఆపాడు. పోడియం మాల్ ఎక్కడుందో పక్కనున్న పాన్‌షాప్‌లో అడగాలంటూ చెప్పాడు. దీంతో అడ్రస్ అడిగేందుకు హరిప్రసాద్ షాపు వద్దకు వెళ్లగానే యాక్టివా బైక్‌తో గుర్తుతెలియని వ్యక్తి ఉడాయించాడు. తన యాక్టివా బైక్‌తో పాటు బైక్ హ్యాండిల్ మీద లొకేషన్ చూసేందుకు ఉంచిన సెల్‌ఫోన్‌తో సహా చోరీ చేశాడంటూ బాధితుడు గురువారం అర్ధరాత్రి ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## రైతాంగం మోసపోయింది..



గతేడాదిగా తెలంగాణ రైతాంగం అన్ని విధాలుగా మోసపోయిందని బీఆర్ఎస్ పార్టీ యువనేత పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి అన్నారు. రైతుబంధు, రుణమాఫీతో కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. కొందరికే రుణమాఫీ చేసి పూర్తిస్థాయిలో చేశామంటూ గొప్పలు చెప్పుకుంటున్నారన్నారు. ఏడాది పాలన విజయోత్సవాలు చేసుకోవడంలో వాళ్ల కార్యకర్తలు మినహా రైతులు ఎవరూ లేరన్నారు. ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయి కాబట్టి ఊర్లల్లో కాంగ్రెస్ పార్టీ ఓట్లు అడిగే పరిస్థితి లేదు కాబట్టే కొత్తగా మళ్లీ రైతుభరోసా అంటూ రాగమెత్తుకున్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మాట నీటిబుడగలాగా మారిపోయిందని, ఏ ఒక్క హామీని పూర్తిస్థాయిలో నెరవేర్చలేదన్నారు.



శుక్రవారం రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన రైతు ధర్నాలో పాల్గొన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు సబితాఇంద్రారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్, పట్నం అవినాశ్‌రెడ్డి , కార్తీక్‌రెడ్డి తదితరులు

# హామీలపై కాంగ్రెస్‌ను నిలదీద్దాం

- ఢిల్లీ ఎన్నికల్లో హామీల అమలు బాధ్యత తనదేనని రేవంత్‌రెడ్డి చెప్పడం విడ్డూరం
- అమ్మకు అన్నం పెట్టనోడు.. చిన్నమ్మకు బంగారు గాజులు ఎలా చేయిస్తాడు..
- కేసీఆర్ హయాంలో నాట్ల సమయంలోనే రైతుబంధు వేస్తే, కాంగ్రెసోళ్లు ఓట్ల సమయంలో వేస్తుండ్రు
- బీఆర్ఎస్ హయాంలోనే షాబాద్ మండలం అన్ని రంగాల్లో అభివృద్ధి
- ఈ ఏడాదిలోనే చేవెళ్లతో పాటు పార్టీ ఫిరాయించిన పది స్థానాలకూ ఉప ఎన్నికలు ఖాయం
- పది స్థానాల్లోనూ బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకుందాం
- స్థానిక సంస్థల కోసం డ్రామాలు ఆడుతున్న కాంగ్రెస్‌కు గుణపాఠం చెబుదాం
- షాబాద్‌లోని రైతుధర్నాలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- పట్నం అవినాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికిన బీఆర్ఎస్ శ్రేణులు

షాబాద్, జనవరి 17 : రేవంత్‌రెడ్డి రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేసేదాకా నిలదీద్దామని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. షాబాద్ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ యువనేత పట్నం అవినాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతుధర్నా కార్యక్రమానికి కేటీఆర్‌తో పాటు మాజీ మంత్రులు పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డి, మహమూద్ అలీ, శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నేత ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, పాడి కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్సీలు నవీన్‌కుమార్‌రెడ్డి, శంభీపూర్ రాజు, మాజీ ఎమ్మెల్యేలు పట్నం నరేందర్‌రెడ్డి, అంజయ్యయాదవ్, మెతుకు ఆనంద్, కొప్పుల మహేశ్‌రెడ్డి, బాల్క సుమన్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర యువనేత పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. షాబాద్‌లోని హరిజనవాడ చౌరస్తా నుంచి రహదారికి ఇరువైపులా జేసీబీల్లో కార్యకర్తలు నిల్చుని పూలు చల్లుతూ కేటీఆర్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. రేవంత్‌రెడ్డి ఢిల్లీకి వెళ్లి తెలంగాణలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేశామని, ఢిల్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపిస్తే హామీలను అమలు చేసే బాధ్యత తాను చూసుకుంటానని చెప్పడం విడ్డూరంగా ఉన్నదన్నారు. అమ్మకు అన్నం పెట్టనోడు.. చిన్నమ్మకు బంగారు గాజులు ఎలా చేయిస్తాడని ఎద్దేవా చేశారు. కూటిలో రాయితీయనోడు ఏట్ల రాయి తీస్తడా.. అని ప్రశ్నించారు. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ఎకరాకు రూ.15వేలు రైతుభరోసా అందించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేవెళ్ల నియోజకవర్గంలోని షాబాద్ మండలంలో చందనవెళ్లి, సీతారాంపూర్ గ్రామాల్లో 2500 ఎకరాల ప్రభుత్వ భూముల్లో అనేక కంపెనీలు తీసుకొచ్చి ఈ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామన్నారు. కాంగ్రెస్ వచ్చాక ఏడాది కాలంలో ఒక్క కంపెనీ తీసుకురాలేదన్నారు. తాము తెచ్చిన కంపెనీలను వారు ప్రారంభించి గొప్పలు చెప్పుకుంటున్నారని తెలిపారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో త్వరలో ఉప ఎన్నికలు రానున్నాయని, రంగారెడ్డి జిల్లాలోని చేవెళ్ల, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లితో పాటు మిగతా జిల్లాలో కలిపి పది స్థానాల్లో ఉప ఎన్నికలు కచ్చితంగా జరుగుతాయని, తప్పనిసరిగా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకుంటామని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసం ప్రజలను, రైతులను మోసం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ రైతుభరోసా అందిస్తామని చెబుతున్నదని, కేసీఆర్ హయాంలో నాట్లు వేసేటప్పుడు రైతుబంధు డబ్బులు వేసేవారని, కాంగ్రెస్ హయాంలో ఓట్ల సమయంలో డబ్బులు వేస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేసేదాకా విడిచిపెట్టేది లేదన్నారు. కాంగ్రెస్ పార్టీని ఓడగొట్టి చేవెళ్లలో మళ్లీ గులాబీ జెండాను ఎగురవేసి కచ్చితంగా కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అయినట్టుగా గొప్పగా స్వాగతం పలికినందుకు అవినాశ్‌రెడ్డిని కేటీఆర్ అభినందించారు. పార్టీ కోసం కష్టపడుతున్న అవినాశ్‌కు భవిష్యత్‌లో మంచి అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ పట్లోళ్ల కృష్ణారెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్ నాగేందర్‌గౌడ్, భువనగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి క్యామ మల్లేశ్, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్, ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు చిల్కమర్రి నర్సింహులు, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు స్వప్న, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఈట గణేశ్, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ మాజీ ఇంచార్జి దేశమళ్ళ ఆంజనేయులు, బీఆర్ఎస్ పార్టీ మండలాల అధ్యక్షులు నర్సింగ్‌రావు, ప్రభాకర్, గోవర్ధన్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు జడల రాజేందర్ గౌడ్, నక్క శ్రీనివాస్‌గౌడ్, శేరిగూడెం వెంకటయ్య, కొలన్ ప్రభాకర్‌రెడ్డి, పొన్న నర్సింహారెడ్డి, కొంపల్లి అనంతరెడ్డి, ఎంపీ మతీన్, వెంకట్‌యాదవ్, రమేశ్‌యాదవ్, బుర్కుంట సతీశ్, విజయ్‌కుమార్, శ్రీశైలంరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ జడల లక్ష్మి, మండల కో-ఆప్షన్ మాజీ సభ్యుడు చాంద్‌పాషా, ఆయూబ్, మాజీ సర్పంచ్‌లు పోనమోని కేతన, కుమ్మరి దర్శన్, కవిత, ఈదుల కృష్ణగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, రాంచంద్రారెడ్డి, రాజేందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, నర్సింహారెడ్డి, చంద్రశేఖర్, దేవేందర్‌రెడ్డి, సుదర్శన్, గణేశ్‌గౌడ్, పాండురంగారెడ్డి, పార్టీ నాయకులు నర్సింహులుగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, సూద యాదయ్య, శేఖర్, ఆరీఫ్, ముఖ్రంఖాన్, ఇమ్రాన్, ముజీబ్, మంగలి సత్యం, శ్రీశైలం, రాంచందర్, అవిలాశ్‌గౌడ్ ,అంజయ్య, దర్శన్, గోపాల్, నర్సింహులు, మునీర్, రవి, కృష్ణయ్య, బల్వంత్‌రెడ్డి, కృష్ణగౌడ్ పాల్గొన్నారు.

## రేవంత్‌రెడ్డి చెప్పేది ఒకటి.. చేసేది ఒకటి..



ఎన్నికల కంటే ముందు రేవంత్‌రెడ్డి చెప్పిన మాటలేంటి, ఇప్పుడు చేస్తున్న పనులేమిటని మాజీ మంత్రి పట్లోళ్ళ సబితాఇంద్రారెడ్డి ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి ఢిల్లీలో కూర్చుని తెలంగాణలో అందరికీ రుణమాఫీ చేశామని చెబుతుండడం హాస్యాస్పదమన్నారు. కేసీఆర్ హయాంలో చినుకులు పడే సమయంలో రైతుబంధు డబ్బులు జమ చేసేవారని, ఫోన్లో టింగ్ టింగ్ శబ్దాలు వచ్చేవని గుర్తు చేశారు. కాంగ్రెస్ వచ్చాక రైతును ఆగమాగం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం రుణమాఫీ చేయాలని, రైతు భరోసా అందించాలనే ఉద్దేశంతో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రైతుధర్నా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. అన్నం ఉడికిందా లేదా అంటే ఒక మెతుకు పట్టుకుని చూస్తామని, అలాగే ఏడాది కాలంలో రాష్ట్రం ఎంత అభివృద్ధి చెందిందో తెలియాలంటే షాబాద్‌ను ఉదహరణగా తీసుకుంటే సరిపోతుందన్నారు. గతంలో షాబాద్ ఎట్లుండే.. ఇప్పుడు షాబాద్ ఎట్లయిందో ప్రజలు ఆలోచించాలన్నారు. ఊర్లలో కూడా అభివృద్ధి ఏ విధంగా ఉందో చూస్తే తెలుస్తుందని, కేసీఆర్ హయాంలో జరిగిన అభివృద్ధి కనిపిస్తున్నదని స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేసేదాకా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామన్నారు.

## కాంగ్రెస్ దొంగ పార్టీ..

కాంగ్రెస్ దొంగ పార్టీ అని, రేవంత్‌రెడ్డి రైతుల కోసం ఎలాంటి పనులు చేయలేదని మాజీ మంత్రి మహమూద్ అలీ అన్నారు. రైతుల అభివృద్ధి కోసం పాటుపడే ఒకేఒక పార్టీ బీఆర్ఎస్ పార్టీ అని చెప్పారు. కేసీఆర్, కేటీఆర్ ఇద్దరు రైతుల బాగు కోసం నిరంతరం పాటుపడుతున్నారన్నారు. గతంలో 60 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ రైతుల కోసం ఏనాడు ఆలోచించలేదని, దేశంలో రైతుబిడ్డగా కేసీఆర్ అన్నదాతల సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. రైతుబంధు, రైతుబీమా, నిరంతర కరెంట్ సరఫరా ఇచ్చి రైతులను అండగా నిలిచారు. కాంగ్రెస్ చెప్పిన ఆరు గ్యారెంటీల్లో ఏ ఒక్కటి కూడా పూర్తిస్థాయిలో అమలు కాలేదన్నారు. మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామని మోసం చేసిందన్నారు. హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాలను అభివృద్ధి చేసిన ఘనత కేటీఆర్‌కే దక్కుతుందన్నారు.

## మోసం చేసినోడిని జైల్లో వేయాల్నా?.. మోసాలను అడ్డుకున్నోడిని జైల్లో వేయాల్నా..?

మోసం చేసినోడిని జైల్లో వేయాల్నా, మోసాలను అడ్డుకున్నోడిని జైల్లో వేయాలో ప్రజలు చెప్పాలని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. తెలంగాణ ప్రజల ఆస్తులు ఎందుకు కొల్లగొడుతున్నావు ? రైతుల భూములు ఎందుకు గుంజుకుంటున్నావని అడిగినందుకు కేటీఆర్ మీద రేవంత్‌రెడ్డి అక్రమంగా కేసులు పెడుతున్నారన్నారు. ఏసీబీ ఆఫీస్ నుంచి తెలంగాణ భవన్‌కు నడుచుకుంటూ వస్తే కేటీఆర్ మీద కేసు పెట్టారన్నారు. భువనగిరిలో కాంగ్రెస్ గుండాలు పెద్ద ఎత్తున ర్యాలీ తీసుకుంటూ వెళ్లి బీఆర్ఎస్ కార్యాలయంపై దాడి చేయడంతో పాటు, కేసీఆర్ ఫొటోను ముక్కలు ముక్కలు చేశారని మండిపడ్డారు. గురుకులాల్లో 54 మంది విద్యార్థులకు విష ఆహారం ఇచ్చి చంపారని అడుగుతున్న బీఆర్ఎస్ పార్టీని, సోషల్ మీడియా కార్యకర్తలను రాత్రికి రాత్రే జైలుకు పంపించిన దుర్మార్గమైనది కాంగ్రెస్ ప్రభుత్వమని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.50 లక్షలు బ్యాగుతో రెడ్ హ్యాండ్‌గా దొరికిన వ్యక్తి జైల్లో ఉండాలే కానీ, దురదృష్టకరం ముఖ్యమంత్రి అయ్యాడన్నారు. అంబానీ, ఆదానీల దగ్గర నుంచి దొంగచాటుగా రూ.100 కోట్లు తీసుకుని, రూ. 12వేల కోట్ల తెలంగాణ ఆస్తిని ఆదానికి కట్టపెడుతుంటే కేటీఆర్ ఒక్కరే పోరాటం చేస్తే ఏసీబీ, ఈడీ కేసులు పెట్టి జైలుకు పంపియ్యాలని చూస్తున్నాడన్నారు. లగచెర్ల రైతులను సంగారెడ్డి జైలులో పెట్టారన్నారు.



గౌతంనగర్‌లో రైల్వే గేట్ వద్ద వివిధ శాఖల అధికారులతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి తదితరులు

# గౌతంనగర్ రైల్వే గేటు వద్ద ఆర్‌యూబీ

- ఇండ్లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా స్థల సేకరణ
- ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

నేరేడ్‌మెట్, జనవరి 17: మల్కాజిగిరి రైల్వే స్టేషన్ సమీపంలోని గౌతంనగర్ రైల్వే గేట్ వద్ద ఆర్‌యూబీ నిర్మాణంలో స్థానిక ప్రజల నివాసాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా స్థల సేకరణ జరుపుతామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి వెల్లడించారు. గజానికి లక్ష రూపాయల చొప్పున నష్టపరిహారం చెల్లించి భూమి సేకరిస్తామని స్పష్టం చేశారు. శుక్రవారం గౌతంనగర్ రైల్వే గేట్ వద్ద రైల్వే, జీహెచ్ఎంసీ, వాటర్‌బోర్డు , విద్యుత్ శాఖ అధికారులతో కలిసి ఆర్‌యూబీ నిర్మాణానికి సేకరించాల్సిన స్థలాన్ని స్థానిక కార్పొరేటర్ మేకల సునీతా రాముయాదవ్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గౌతంనగర్ ఆర్‌యూబీ నిర్మాణంలో నిర్వాసితులకు ఎలాంటి అన్యాయం జరగనివ్వకుండా చూస్తామని చెప్పారు. ఈ సందర్భంగా స్థానికులు తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులు స్వయంగా ఎమ్మెల్యేకు వివరించారు. ఆర్‌యూబీతో తమ ఇండ్లను కోల్పోవాల్సి వస్తుందని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, నిర్వాసితులకు ఎలాంటి అన్యాయం జరగకుండా ఆర్‌యూబీ నిర్మాణానికి స్థల సేకరణ జరుపుతామని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. ఇన్నాళ్లు కష్టపడి నిర్మించుకున్న ఇండ్లను కూల్చివేసేందుకు తాము రాలేదని, ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్యను తీర్చడానికి తాము ఆర్‌యూబీ నిర్మాణానికి పూనుకున్నామని స్పష్టం చేశారు. ఈ నిర్మాణం కోసం రైల్వే, ఎలక్ట్రిసిటీ, మున్సిపాలిటీ తదితర శాఖలకు సంబంధించిన అధికారులతో ఎన్నో సమీక్షా సమావేశాలు నిర్వహించి, ఇప్పటికీ ఒక కొలిక్కి తీసుకురాగలిగామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో రైల్వే ఇంజినీరింగ్, వివిధ శాఖల అధికారులు, బీఆర్ఎస్ నాయకులు మేకల రాముయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులకు దక్కేనా..?

- లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియపై అనుమానాలు
- కాంగ్రెస్ సానుభూతిపరులకే పథకాలంటూ ప్రచారం
- ఆందోళనలో దరఖాస్తుదారులు

మేడ్చల్: కాంగ్రెస్ ప్రభుత్వ గ్యారెంటీలు అర్హులకు దక్కుతాయా... లబ్ధిదారుల ఎంపిక సజావుగా జరుగుతుందా అన్న సందేహాలు దరఖాస్తుదారులు వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ సానుభూతిపరులకు మొదటి ప్రాధాన్యత అంటూ జరుగుతున్న ప్రచారంతో దరఖాస్తుదారులు ఆందోళనకు గురవుతున్నారు. ఎన్నో పథకాలపై హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక గత ఏడాది డిసెంబర్‌లో ప్రజాపాలన పేరిట ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు, రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాపై దరఖాస్తులను స్వీకరించారు. ఏడాది కిందట స్వీకరించిన దరఖాస్తులను సర్వే చేసి గ్యారెంటీల పథకాలకు అర్హులను ఎంపిక చేసి ఈ నెల 26న లబ్ధిదారులకు అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. మేడ్చల్ జిల్లావ్యాప్తంగా జరిగిన ప్రజాపాలనలో వివిధ పథకాలకు వచ్చిన లక్షల దరఖాస్తుల్లో నిబంధనలకు అనుగుణంగా అర్హుల ఎంపిక జరుగుతుందా లేక కాంగ్రెస్ నాయకుల ఒత్తిడికి అధికారులు తలొగ్గుతారా అన్నది లబ్ధిదారుల ఎంపిక ద్వారా తేలిపోనున్నది.

### 1,22,043 లక్షల దరఖాస్తులు..

జిల్లాలోని మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి నియోజకవర్గాల నుంచి రేషన్ కార్డుల కోసం 1,22,043 దరఖాస్తులు వచ్చాయి. రేషన్‌కార్డు ఒక వ్యక్తికి ఒకే చోట ఉండాలని, గ్రామీణ ప్రాంతంలో రూ. లక్ష 50 వేల ఆదాయం మించి ఉండరాదని, అర్బన్ ప్రాంతలో రెండు లక్షలకు మించి ఆదాయం ఉండని వారికి కొత్త రేషన్‌కార్డులను జారీ చేసేలా నిర్ణయించారు. జిల్లాలో ఇప్పటికే 5,32,938 రేషన్ కార్డులు ఉన్నాయి. అయితే కొత్తగా ఎంత మంది లబ్ధిదారులను ఎంపిక చేస్తారన్నది ఈ నెల 26న తేలిపోనున్నది.



మేడ్చల్ జిల్లాలో రేషన్‌కార్డుల దరఖాస్తుల సర్వేను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ గౌతమ్

### నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇండ్లు..

ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద దారిద్ర్యారేఖకు దిగువన ఉన్న గృహాలు, ఇండ్లు లేనివారు, నిర్మాణానికి స్థలం ఉన్నవారు, పూరి గుడిసెలో ఉన్నవారు, అద్దె ఇండ్లలో నివాసం ఉన్నవారు అర్హులుగా ఎంపిక చేయనున్నట్లు పేర్కొనగా, భూమిలేని వ్యవసాయ కూలీలు, పారిశుద్ధ్య కార్మికులు, దివ్యాంగులకు మొదటి ప్రాధాన్యం ఇస్తామని అధికారులు స్పష్టం చేస్తున్నా.. ఆచరణలో ఎంత వరకు అమలు సాధ్యమవుతుందన్న దానిపై అనుమానులున్నాయి. జిల్లాలో మొదటి విడతలో నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇండ్ల చొప్పున ఐదు నియోజకవర్గాల్లో 17,500 వేల ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని వర్తింపజేయనున్నారు. లక్షల్లో దరఖాస్తులు రాగా, నియోజకవర్గానికి 3,500లే ఇస్తే మిగతా లబ్ధిదారులకు రెండో విడతలో ఎప్పుడు ఇస్తారన్న దానిపై క్లారిటీ రావాల్సి ఉంది. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద జిల్లాలో వెయ్యి మందిని ఎంపిక చేయనున్నారు. ఈ పథకాల్లో లబ్ధిదారుల ఎంపిక ఈ నెల 21 నుంచి 24 వరకు వార్డు సభలు, గ్రామ సభల్లో జరిగేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.